గొప్పవారితో గుసగుసలు

నాచన సోముడు

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[అర్ధవలయాకార పర్వతపంక్తి— ఎదుట బైలు—వలయం మధ్యభాగాన్నానుకుని ఒక ఊరు - దానికొకప్రక్కనుండి పారుచు బయలులో ప్రవేశించే సెలయేరు—దాని యొడ్డున అక్కడక్కడ ఇసుకపట్లు బయలుదగ్గర ఒక యిసుకపట్టుమీద పచార్లు చేస్తూ సోమన కవినాథుడు—ఆయన మొగమెందుకో ధుమధుమ లాడుతూంది! మనిషి మంచి తేజస్వి; గరుటార్లవారి ముక్కుకు మల్లే కొంచెం వంగివున్న ముక్కు, ఆజానుబాహువులు, విశాల నేత్రాలు, వెడల్పైన ఱొమ్ము, అంగతా లక్షణాలన్నీ తగ్గట్లున్నాయి. కుడిచేతి తర్జనిమటుకు ఎప్పుడూ కదులుతూంది. సమీపిస్తున్న నన్ను చూచి—]

సో: ఏమోయ్ వచ్చావ్! రాత్రి మనస్సు చేసటగా వుంది ప్రొద్దున్నే యిక్కడికి వచ్చున్నా.

నే: ఆహా యీ దృశ్యమెంత బాగుందండీ. ఆ కొండలు, దూరాన వూరూ. అక్కడక్కడ ప్రకృతి కప్పులుపోసినట్లు చెట్లగుంపులు, దూరాన్నుంచి వంకీకడ్డీలాగున ప్రవహిస్తున్న యీసెలయేరు, తమగున్న తెల్లతివాశీలాంటి యిసుకపట్లు, వాటి అంచుల్నుంచి చూపుమేరదాకా పచ్చపూరి చపటాల్లాంటి పచ్చికపట్లూ—

సో: (ఇంకా ఘుమఘుమతో) ఊఁ ఐతే రాత్రి వచ్చి తమతో రహస్యంగా మాట్లాడాలంది నీ కవిత్వపు గుల తీర్చుకోడానికీ, ప్రదేశాన్ని వర్ణించి, ఆ వర్ణననుగురించి మీ అభిప్రాయ మేమిటని అడగడానికా!

నే: కాదు క్షమించండి. ఈ దృశ్యాన్ని చూచేటప్పటికి మనస్సు పట్టుకోలేక ఆహా అనిపించిం దాన్నేదో మాటల్లో—

సో: దీన్ని చూచేప్పటికే ఆహాఅనిపించిందేం! దేశం తిరిగి దాన్లో గనుబడే అత్యద్భుత దృశ్యాలు వింధ్య, హిమవంతం వాటి లోయల్లో గాన్పించే అందాలు చూస్తే, నిద్రాహారాలన్న, పెండ్లాం బిడ్డల్నే మరిచేట్లున్నావ్. మీ కాలంవాండ్లంతా సోమార్లు. ఏదో వెధవ యింగ్లీషు ముక్క లునాలు చదివి, వాండ్లదే జ్ఞాన మనుకుని, వాండ్ల వేషాలన్నీ వేస్తూ, మాకన్నా లేరని విర్రవీగే వెర్రిబాగుల మూక. ఆ తెల్లాడెళ్ళాలి మీ బ్రదుకులు బైట పడ్తాయ్.

నే: ఇందాకనే నమస్కార బాణం ప్రయోగించుకున్నా. నాకు తోచిం దడగొచ్చునా?

సో: నా కోపం రాకుండా అడుగు.

నే: అదెట్లాగండీ! రాత్రినుంచీ చూస్తా. మీరు గొప్పవారుకదా నిద్రగూడా యెట్లా పోతారా గమనిద్దా మని మీ గదికిటికీక్రింద పడుకుని, కంతలోనుండా మీ స్థితినంతా. పరికించా. తెల్లవార్లు ఇకో, అబ్బా, అహాల్తోనే గడిపారు. మొగం ముడి ఒక్క క్షణం విప్పలా. దేనికండీ యీ బాధ? తమరు వివాహం చేసుకోలా?

సో: నీ కా గొడవంతా యెందుకోయ్? నా పెండ్లి పేరంటాల్ని కెందుకోయ్?

నే: ఏమీలా, వారుంటే, మీకొంత శాంతి మనుకేదేమో నని.

సో: సరే లేదుగా, పైమాట.

నే: మీకెప్పుడూ యింత చిరాకెందుకు?

సో: (కొంచెం మొగం ముడి విప్పుతూ) చిరాగ్గాక, శాంతి, సంతోషాలెట్లా వుంటాయ్? తిక్కన్న నాకొంపతీసాడు!

నే: అదేమిటండీ!

సో: ఏమిటో ఆ ఘోష నీ కెందుకు?

నే: కాస్త చెబుదురూ. రహస్యంగా ఏమడిగినా చెప్తానంటిరే!

సో: అనడం నాకంతా నిష్టగాంది! ఏమని చెప్పను? అతను భారతంరాసి నాకొంప తీసినాడు.

నే: నా కర్థంకాలా. ఆయన భారతం వ్రాస్తే మీకొంపకేం నష్టం.

సో: (విసుగుతో) ఎవరన్నావింటే, నేమనుకుంటారో అనుకుని, లోలోపల కుమిలి కుమిలి ఉడికిపోతున్న విషయాన్ని బైటికి లాగి వెల్లడి చేస్తేగాని నీ కెంతో చేట్టు లేదు. చెప్తాబట్టు. బుద్ధెరిగినప్పట్నుంచీ నాకు భారతమంటే వెఱ్ఱి అభిమానం. మా ఊరాంధ్రంలో నొక మారుగా లుంది. మే మెరుగుంది నన్నయొక్కడే భారతం రాసాడని నేనాశపడేవాణ్ణి. నన్నయ్య రెండున్నర పర్వాలే వ్రాసాడుకదా, మిగతావి మనంరాద్దామని. చదువు పూర్తిచేసుకుందామని కాశీనవద్వీపా లెళ్లి, నాల్గేండ్లలో షట్శాస్త్రవేత్త ననుపించుకుని యింటికొచ్చి చిన్నప్పట్నుంచీ వాలివున్న ఆంధ్రంలో తీవ్ర కృషి చేసి పాండిత్యం సంపాదించుకున్నా ఆగ్నెల్లలో. అంతకుముందే చెప్పనేర్చిన ఆంధ్రకవిత్వంలో మహాకవి బిరుదు కర్హుణ్ణని అందరిచేతా ననుపించుకున్నా. భారతరచనాదీక్ష నారంభించడానికి ముహూర్తం పెట్టుకున్నా. రేపు దీక్షనగా ఇవ్వాళ మాచుట్టం, గుంటూరు వాడొకడొక బండీమీద వాకిట్లో దిగి తాటాకు గ్రంథాల బుట్టలు దింపుతున్నాడు కిందికి. ఇవేమిటన్నా. తిక్కన రాసిన ఆంధ్రభారత మన్నాడు. నా కెట్లా గుంటుందో యోచించుకో! ఆ ఆశాభంగంతో నాకు విపరీతమైన చిరాకు పుట్టింది.

నే: అంతమాత్రాని కింత చిరాకండీ! ఇక పురాణా లేకపోయినాయా రాయడానికి!

సో: బుద్ధెరిగినప్పట్నుంచి నాకదంటే వెర్రభిమాన మని చెప్పలా.

నే: అయితే మీరుకూడా దాన్నే రాయకపోయినారా, అధికస్య అధికం ఫల మని?

సో: (మొగం గట్టిగా మూడేసి పండ్లు బిగబట్టి) ఇదుగో నీకు బుద్ధిలేదు. భారతం నన్నయ్య తిక్కన్నలు రాయకుంటే బండీ కెత్తిద్దునుగాని వారిద్దరు రాసింతర్వాత మళ్ళీ రాసేటంత అవ్యక్తుణ్ణ నుకున్నావా?

నే: అదేమిటండీ అట్లాగంటారు? మా కాలాన్న ఒక పండితుడు చేసాడే ఆ పనిని.

సో: మీ కాలంలో నెవరో యేదో చేస్తే నన్నూ చేయమంటావా ఆ పని? వారిని వెక్కిరించినట్లా వారికంటే బాగా రాసేట్టా? మీ కాలంలో రాసా డంటివే దాన్నాంధ్రలోకం బ్రహ్మరథం బట్టిందా!

నే: లేదు.

సో: మరిఇకనేం. నా గతీ అంతే అయ్యేది.

నే: అదేమండీ అట్లాగంటారు! మీ పద్యాలు సామాన్యంవా?

సో: నీకు మతి పోతూంది. వారి పద్యాల కంటే గొప్పవా?

నే: చిత్తం. అయితేనేం? మీరు ఉత్తర హరివంశం భారతంవంటి పురాణాన్నే వ్రాసారుగా?

సో: కుంచం నిలువుగా కొలవడానికి వీల్లేక అడ్డంగా కొల్చినట్లు.

నే: అదేమిటి? మీ ఉత్తర హరివంశమేం అల్లాటప్పా గ్రంథమాండి!

సో: ఏడ్చినట్లుంది, భ్రష్టకారి గ్రంథం.

నే: మే మొప్పుకోమండోయ్.

సో: ఒప్పుకోకుంటే, నెత్తినెట్టుకు దేవుళ్ళాడండి పనికిమాలిందాన్ని. అందుకనే అవతారిక లేకుండా వదిలించా.

నే: ఏమండోయ్! మీ "కుజంకుంజరం" పద్యం, "అభ్రంకషంబైన పద్యం" "గనయంగొన" యంపద్యం—

సో: ఆ ట్రేయేకరు పెట్టకూ నాకుమంట. భారతం రాసుంటే రాసుండేవాణ్లో నవ్వొకటొకొక్క. అరరే యెట్లా యెట్లా వర్ణించెటందును! ఎట్లాటలంకారాలు గుప్పించుందునో, ఎట్లా పెట్లాటి పదాలు కూర్చుందునో, అరరే, అరరే!

నే: పాపం! గొప్ప ఆశాభంగమైంది. తమరు చిరాకుపడడం తప్పలా, కానీ ఒక్కమాట అడుగుతా కొట్టరుకద?

సో: నాకంత కోపమొచ్చే దెందు కడగడం?

నే: కోపమొచ్చేదికాదు. ఊరికేనే కస్సుబుస్సంటున్నారని అన్నా. అయినా కొట్టండి పట్టా. భారతం వ్రాయడానికి వీల్లేకపోయెనంటారు కదా, నేను పైనచెప్పిన పద్యాల్లాటివి వ్రాస్తే భారతంవంటి గ్రంథంలో నేం బాగుంటుంది?

సో: వ్రాయలేదుగా, యెందుకా గొడవ? అయినా అట్లాటిగ్రంథంలో నాలాటి పద్యాలెందుకు వ్రాస్తా.

నే: మీరెత్తుకు మీ కేదైనా కావ్యం వ్రాస్తే బాగుండేది.

సో: ఆంధ్రభాషాప్రపంచంలోకి ముఖ్యమైన సంస్కృతగ్రంథాలు దిగింతర్వాత కదా కావ్యరచన విచారించడం. అష్టాదశ పురాణాలు దిగాయా. ఇంతకు ఒక కవి నివిరా యని రా యడమేంపని? అట్లా వ్రాసేది కవిత్వం కానే కాదు. వాడి మనస్సుకే యావేశం తోస్తే నట్లా నడుస్తాడుకాని కవిత్వమేం కొలవిష. యీ మాటకి ముక్కకి ముక్కగా అనువాద ముండాలనే నియమం లేనవుడా గ్రంథాల్లోమటుకు రచనాకౌశలం చూపించరాదూ! ఆంధ్రభారతంలో నన్నయాదులెన్నెన్ని స్వతంత్రమార్గాలు తొక్కలా! సరైన అనువాదం చేతగాకనా వారట్లా వ్రాసింది? అట్లా వ్రాస్తే రసపోషక దని స్వతంత్రించారు. అందుకనే అంద మనిపించి, మళ్లీ ముట్టుకోవడాని కితర్లకు రుచుపొచ్చింది.

నే: బాగుంది. సంస్కృత నాటకాల భాషాంతరీకరణమో?

సో: చేయొచ్చు కాని, స్వతంత్రించి వ్రాయగల బుద్ధి అనువాదానికి దిగదోయ్! పైగా నాటకాలకొక లక్షణముంది. ఆ అందం మూలంలో నున్నట్లు అనువాదంలో దించడం ఒక్కొకసారి అసాధ్యం. అప్పుడు మూలానికున్న పేరు పోతుంది. అయితే యీ దోషం పురాణాలకు పట్టదా అను. పట్టొచ్చు. పట్టినా కథాప్రాధాన్యంగల పురాణాల్లో అంతగా పాటింపుకు రాదు.

నే: చిత్తం. తమరింకా యేమీ వ్రాయలా, ఒక్క ఉత్తర హరివంశమేనా?

సో: వ్రాయకేం వ్రాసా. యింట్లో నున్నాయ్. ఎన్ని వ్రాస్తేనేం భారతం వ్రాయక పోయింతర్వాత?

నే: మీకు తీరని చింత పట్టుకుందే పాపం!

సో: అయితేనేమటుకేం? కీర్తికి నే మిప్పటికి చేసిన భాషాసేవే చాలు.

నే: నిజం. ప్రొద్దెక్కుతుంది నాకు సెలవిప్పించండి. ఇప్పుడే ప్రయాణమై మరోచోటికెళ్ళాలి.

సో: సరే పో. నాకూ అనుష్ఠాన సమయం సమీపిస్తూంది. మళ్ళీ యీ దార్నొస్తే ఒకసారి కలుసుకో. నీతో మాట్లాడడ మానందంగా వుంది. ఏదీ దాచుకోకుండా అడుగుతావ్. నీకు రహస్యాలు లే వనుకుంటా?

నే: లేవు. తమ కుంటాయని రహస్యమనుకున్నా.

సో: సరే వెళ్ళిరా.

[నిష్క్రమణం]

-: ఉమావారి ఆభరణములు :-

10 సంవత్సరములు గ్యారంటీ.

అసలు బంగారపురేకు. అమూల్య లోహముపై అతికించబడి తయారుచేయబడినవి.

అటులకాదని నిరూపించినవారికి రు. 500/- బహుమాన మివ్వబడును.



శుభసమయములయందును, పండుగలయందును, యువతీమణులందరు ధరించి ఆనందించండి. వలయువారికి 600 ఆభరణములకేటలాగు ఉచితము.

781. కొత వడ్డాణములు చుట్టుకొలతలు, ధరలు వివరం.

24"...రు. 41-8-0, 30"...రు. 51-8-0, 36"...రు. 61-8-0. పోస్టేజీతో సహా.

ఉమా గోల్డు కవరింగు వర్క్సు, ఉమామహల్, మచిలీపట్టణం.

Tel: "UMA" Masulipatam. ఉమాగోల్డు కవరింగు వర్క్సు పోస్టు ఆఫీసు.